www.vaarthavedhikasurya.com

PRGI.NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| తెలంగాణ TELANGANA | సంపుటి : 1 VOLUME : 1 | సంచిక : 268 ISSUE : 268 | సోమవారం, ఫిబ్రవరి 23, 2026 MONDAY, FEBRUARY 23, 2026 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాస చారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు : 8 PAGES : 8 | వెల : 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

## భారీ ఉగ్ర కుట్ర భగ్నం!

- తమిళనాడు, బెంగాల్లో 8 మంది అరెస్టు
- హైదరాబాద్ చంచల్‌గూడ జైలు ములాఖత్‌లలో ఉగ్రకుట్రకు ప్లాన్..




# కాళేశ్వరాన్ని గాలికి వదిలేయం

''గోదావరి జలాలపై శాసనసభలో కూర్చుని చర్చ చేద్దాం. మేం ఏదైనా సవరించుకోవాల్సి ఉంటే అందుకు ఎలాంటి అభ్యంతరం లేదు. పక్క రాష్ట్రానికి నీళ్లు తీసుకెళ్లడానికి మా ప్రభుత్వమే సహకరిస్తోందని ఆరోపిస్తున్నారు. ప్రజా జీవితంలో ఉండి తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన వారు.. ఎవరైనా ఆ పని చేస్తారా? ఏపీ నుంచి వలస వచ్చి ఇక్కడ సెటిలైన వ్యక్తులైనా సహకరిస్తారా? ఇలాంటి చౌకబారు ఆరోపణలతో ప్రయోజనం ఉండదు''

– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నింటినీ రెండేళ్లలో పూర్తి చేస్తాం
- గత సర్కారు కాళేశ్వరానికే రూ.1.02 లక్షల కోట్లు ఖర్చు చేసింది
- మిగతా ప్రాజెక్టుల్ని నిర్లక్ష్యం చేయడంతో భూసేకరణకు ఇబ్బందులు
- 6వేల కోట్లతో మొదలెట్టిన దేవాదుల 18,500 కోట్లకు చేరింది
- గోదావరి జలాల వివాదం రాజకీయ రంగు పులుముకుంది
- పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే ఈ వివాదం వచ్చేదికాదు
- కృష్ణా జలాలపై మేము ఏపీకి సహకరిస్తున్నామనేది పచ్చి అబద్ధం
- బీఆర్ఎస్ నేతలూ శాసనసభకు రండి.. అన్ని అంశాలపై చర్చిద్దాం
- 2027 డిసెంబరు నాటికి దేవాదుల నిర్మాణం పూర్తి కావాలి
- దేవాదులపై సమీక్ష.. మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



వరంగల్/హైదరాబాద్, (వార్తా వేదిక సూర్య)-ఫిబ్రవరి 22:


రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ వచ్చే రెండేళ్లలో పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుకే రూ.1.02 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. నిధులన్నీ ఆ ఒక్క ప్రాజెక్టుకే ఖర్చు చేసి, మిగతా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడంతో ప్రస్తుతం భూసేకరణకు నిధులు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును గాలికి వదిలేయబోమని, అది ప్రజల సొమ్ముతో నిర్మించినదని అన్నారు. దానిని వినియోగంలోకి తెస్తామని మిగతా 2లో..



## సీఎం రేవంత్‌కు హార్వర్డ్ ఆహ్వానం

హైదరాబాద్, (వార్తా వేదిక సూర్య)-ఫిబ్రవరి 22:

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అమెరికాలోని హార్వర్డ్ కెనెడీ స్కూల్ నుంచి అరుదైన ఆహ్వానం అందింది. ఆ సంస్థ తొలిసారిగా నిర్వహిస్తున్న ఏఐ పాలసీ సింపోజియంకు హాజరై ప్రసంగించాల్సిందిగా సీఎంను ఆహ్వానించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మార్చి 27న హార్వర్డ్ స్కూల్ క్యాంపస్‌లో జరగనున్న మిగతా 2లో..



# దేవ్‌జీ లొంగుబాటు!

## మావోయిస్టు అగ్రనేతతో పాటు మల్లా రాజిరెడ్డి సహా 25 మంది కూడా..

- తెలంగాణ పోలీసులకు లొంగిపోయారు
- ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం వెల్లడి
- నేడో, రేపో రాష్ట్ర పోలీసుల ప్రకటన
- సీఎం రేవంత్ సమక్షంలో లొంగుబాటును చూపే అవకాశం


హైదరాబాద్, (వార్తా వేదిక సూర్య)-ఫిబ్రవరి 22:

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర కమిటీ సభ్యుడైన నర్సింహారెడ్డితో పాటు మొత్తం 25 మంది ప్రత్యేక ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ లొంగుబాటును రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి నిర్ధారించారు. దేవ్‌జీతో పాటు మరికొందరు మావోయిస్టులు తెలంగాణ పోలీసులకు లొంగిపోయారని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం కూడా చెప్పారు. మావోయిస్టు పార్టీకి చెందిన కేంద్ర, రాష్ట్ర కమిటీల్లో తెలంగాణ వ్యక్తులు 15 మంది ఉన్నారని.. వారంతా లొంగిపోవాలని ఇటీవల రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. వాస్తవానికి మల్లోజుల లొంగుబాటు తర్వాత వరసగా వివిధ స్థాయుల్లో ఉన్న మావోయిస్టు క్యాడర్ లొంగుబాటుకు తెలంగాణను వేదికగా చేసుకున్నారు. ఇదే క్రమంలో గత కొన్నాళ్లుగా కరీంనగర్‌కు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, రాజిరెడ్డిల లొంగుబాటుకు సానుకూల వాతావరణం కల్పించాలని ప్రజాసంఘాల నేతలు, మిగతా 2లో..



## ఏపీలో పెరగనున్న 50 నియోజకవర్గాలు

7 లో..



## ఐసెట్ కోసం డిజిటల్ ప్రసారాలు

- సిద్ధమైన టీ-సాట్ నెట్‌వర్క్

హైదరాబాద్, (వార్తా వేదిక సూర్య)-ఫిబ్రవరి 22:

తెలంగాణ ఐసెట్– 2026 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం డిజిటల్ ప్రసారాలు అందించేందుకు టీ-సాట్ నె ట్‌వర్క్ సిద్ధమైంది. ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం నిర్వహించేఐసెట్‌కు సంబంధించిన పాఠ్యాంశాల ప్రసారం సోమవారం (23వ తేదీ) నుంచి ప్రారంభమవుతుందని మిగతా 2లో..

# భయపడకండి..

- మీకు అండగా ఉంటాం..
- మధు పార్క్ అపార్ట్‌మెంట్ వాసులకు హరీశ్‌రావు భరోసా




హైదరాబాద్, (వార్తా వేదిక సూర్య)-ఫిబ్రవరి 22:

కేసీఆర్ మంచి నీళ్లు ఇచ్చి బతుకులను నిలబెడితే.. సీఎం రేవంత్ రెడ్డి బుల్డోజర్లు పెట్టి వారి జీవితాలను కూలగొడుతున్నాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. డీపీఆర్ లేదు.. ఎఫ్‌టీఎల్ తేలలేదు.. అనుమతులు లేవు.. ఏ చట్టం ప్రకారం ఇండ్లు ఖాళీ చేయమని నోటీసులు ఇస్తున్నారని మండిపడ్డారు. ఇండ్లు కూల్చే బదులు నీళ్ల ట్యాంకులో విషం కలిపి చంపండి అని తల్లులు ఆవేదన చెందుతున్నా ఈ ప్రభుత్వానికి కనీస కనికరం లేదా అని ప్రశ్నించారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్‌కు ఇచ్చిన నోటీసులు మిగతా 2లో..



# రాంచందర్‌రావు అరెస్టు

## ఇంటి వద్దే అదుపులోకి తీసుకున్న పోలీసులు..

### ఈటల, ఏలేటి గృహ నిర్బంధం

- కాంగ్రెస్, మజ్లిస్‌పై రాంచందర్‌రావు ఆగ్రహం
- అసద్ చెప్పుచేతల్లో సర్కారు ఉందని విమర్శ
- బాన్సువాడలో హిందువుల ఇళ్లపై రాళ్ల దాడులు అత్యంత అమానుషమని వ్యాఖ్య
- అవినీతిపై చర్చకు సిద్ధమని కాటిపల్లి సవాల్
- కామారెడ్డిలో కొనసాగుతున్న ఉద్రిక్తత

హైదరాబాద్, (వార్తా వేదిక సూర్య)-ఫిబ్రవరి 22:

కామారెడ్డిలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ఘర్షణ వాతావరణం.. బాన్సువాడలో రెండు వర్గాల మధ్య హింసాత్మక ఘటనలు చెలరేగిన నేపథ్యంలో ఆదివారం చలో కామారెడ్డి, బాన్సువాడకు బీజేపీ పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు యత్నించిన పలువురు పార్టీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. మరి కొందరిని గృహ నిర్బంధం చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డితో పాటు బాన్సువాడలో పలు కుటుంబాలను పరామర్శించేందుకు బయలుదేరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును తార్నాకలోని నివాసం వద్ద పోలీసులు అరెస్టు చేసి బొల్లారం మిగతా 2లో..

## ఏపీలో భారత్ నెట్ అమలు కోసం కేంద్రంతో కీలక ఒప్పందం

అమరావతి, (వార్తా వేదిక సూర్య) -ఫిబ్రవరి 22:

గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక సహకార ఒప్పందం కుదిరింది. సుమారు 5 లక్షల గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లకు ఫైబర్ కనెక్షన్లు అందించే లక్ష్యంతో అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్ అమలు చేయనుంది. ఏపీలో ఏబీపీ అమలుకు రూ. 2,432 కోట్ల మేర నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. మిగతా 2లో..




## రెండు కళ్లు మంచిగయ్యేంత వరకు చూయించుకోండి

- నెలకొకసారి కంటి శిబిరం పెడతాం
- ధైర్యంగా ఆపరేషన్లకు వెళ్లి రండి అంటూ మహిళలకు భరోసా
- 12వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో కోమటిరెడ్డి

సంపుటి : 1 సంచిక : 268 వార్త వేదిక సూర్య || హైదరాబాద్ సోమవారం, ఫిబ్రవరి 23, 2026 ||





# కాళేశ్వరాన్ని గాలికి వదిలేయం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ పైన కుంగిందని, లోపలి భాగంలో ఏం జరిగిందో అంచనా వేయటానికి సాంకేతిక బృందాలు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. ఏ బ్యారేజీనీ వృథాగా ఉంచబోమన్నారు. ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి.. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల ప్రాజెక్టును మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో కలిసి సందర్శించారు. నేరుగా దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్దకు వెళ్లి.. గోదావరి జలాల ప్రవాహాన్ని పరిశీలించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోదావరి జలాల వివాదం రాజకీయ రంగు పులుముకుందని, గత పదేళ్ల పాలనలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఈ వివాదమే ఉండేది కాదన్నారు. రాష్ట్రంపై రూ.8.11 లక్షల కోట్ల అప్పుల భారం ఉండడంతో.. సాగునీటి ప్రాజెక్టులు 70–80 శాతం పూర్తయినా పెండింగ్ పనులు పూర్తి చేసుకునేందుకు నిధుల కొరత ఉందని చెప్పారు. అయినా.. ఆర్థిక పరిస్థితులను అధిగమించి రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. 2001లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు రూ.6 వేల కోట్లతో చేపట్టిన దేవాదుల ప్రాజెక్టుకు ఇప్పటికి రూ.14,500 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. అయినా.. ఈ అంచనాలను రూ.18,500 కోటకు పెంచాల్సిందిగా అధికారులు సూచిస్తున్నారని, ఇక్కడితోనైనా దీనికి ఫుల్‌స్టాప్ పెట్టాలని నిర్ణయించామన్నారు.

**కాళేశ్వరాన్ని మహాద్భుతం అన్నారు..**

కాళేశ్వరం ప్రాజెక్టును గత ప్రభుత్వం మహాద్భుతంగా చూపించిందని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఆ ప్రాజెక్టు నుంచి చుక్కనీరు కూడా ఎత్తిపోయకపోయినా దేశంలో అత్యధికంగా వరిసాగు చేసిన రాష్ట్రంగా తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను, పంపుహౌసలను ఏ ఉద్దేశంతో కట్టారో.. ఆ నీళ్లు, నిధులు ఎక్కడికి పోయాయో తాను విమర్శ చేయదలుచుకోలేదన్నారు. అయితే గోదావరి జలాలే కాకుండా కృష్ణా జలాలపైనా అనేక అపోహలు కల్పిస్తున్నారని విమర్శించారు. పక్క రాష్ట్రానికి నీటిని తరలించడానికి తాము సహకరిస్తున్నామంటున్నారని తప్పుబట్టారు. "కృష్ణా జలాలపై పూర్తి స్థాయి చర్చ శాసనసభలోనే చేపట్టాం. బహిరంగ సభలు పెట్టి ఊకదంపుడు ఉపన్యాసాలివ్వడం వద్దు. ఉమ్మడి రాష్ట్రంలో ఏం జరిగింది? తెలంగాణ వచ్చిన తరువాత కేసీఆర్ హయాంలో హరీశ్‌రావు సాగునీటి మంత్రిగా ఉన్నప్పుడు ఏం జరిగింది? రెండేళ్లుగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఏం జరిగిందో చర్చించేందుకు అసెంబ్లీకి ఆహ్వానిస్తున్నాం. కృష్ణా జలాలకు సంబంధించిన అంశాలపై మొన్నటి శాసనసభలో వివరణ ఇచ్చాం. అయినా మీ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి మాపై ఆరోపణలు చేయడం సబబు కాదు. మీరు తప్పు చేశారా? లేదా? అన్నది ప్రజలు గుర్తించారు.. శిక్షించారు" అని రేవంత్ అన్నారు.

**అసెంబ్లీలోనే చర్చ చేద్దాం..**

"గోదావరి జలాలపై శాసనసభలో కూర్చుని చర్చ చేద్దాం. మేం ఏదైనా సవరించుకోవాల్సి ఉంటే అందుకు ఎలాంటి అభ్యంతరం లేదు. పక్క రాష్ట్రానికి నీళ్లు తీసుకెళ్లడానికి మా ప్రభుత్వమే సహకరిస్తోందని ఆరోపిస్తున్నారు. ప్రజా జీవితంలో ఉండి తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన వారు.. ఎవరైనా ఆ పని చేస్తారా? ఏపీ నుంచి వలస వచ్చి ఇక్కడ సెటిలైన వ్యక్తులైనా సహకరిస్తారా? ఇలాంటి చౌకబారు ఆరోపణలతో ప్రయోజనం ఉండదు" అని రేవంత్ అన్నారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడి.. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి పౌరుడికి తాగునీరు అందించటమే లక్ష్యమని ప్రకటించారు. మేడారం జాతరను దక్షిణాది కుంభమేళాగా నిర్వహించుకున్నామని, చిన్నచిన్న సమస్యలున్నా సరి చేసుకున్నామని తెలిపారు. భక్తులు నిరంతరం దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని, బడ్జెట్ సమావేశాల తరువాత మేడారం వస్తానని అన్నారు. కేసీఆర్ తెలంగాణ సమాజానికి ఉపయోగపడే మంచి పుస్తకాలు చదవాలని, చిన జీయర్‌స్వామి సూక్తులు, మంచి ప్రవచనాలు వినాలని సీఎం రేవంత్ సూచించారు. అంతే తప్ప ప్రజలపై విషం కక్కవద్దన్నారు. తమ వారసత్వ ఆస్తిని ఎవరో కొల్లగొట్టారన్నట్లుగా కడుపులో బాధ పెట్టుకుంటే ఆరోగ్యం దెబ్బతింటుందని వ్యాఖ్యానించారు.

**దేవాదుల ప్రాజెక్టుకు రూ.600 కోట్లు..**

దేవాదుల ప్రాజెక్టుకు భూసేకరణ కోసం జూన్ 2లోపు రూ.600 కోట్లు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం ఈ ప్రాజెక్టును సందర్శించిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. సమ్మక్క బ్యారేజీ ఎంత దూరంలో ఉందని, అక్కడ నిల్వ చేస్తే ఇక్కడి వరకు ఎన్ని టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులను అడిగారు. రూ.2,121 కోట్లతో బ్యారేజీ పూర్తి చేశామని, 6.94 టీఎంసీల నీరు బ్యారేజీలో నిల్వ ఉంటుందని, 300 రోజులు 60 టీఎంసీల వరకు నీటిని లిఫ్టు చేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు రూ.14,500 కోట్ల వరకు ఖర్చు చేశామని, ఇంకో రూ.4వేల కోట్ల వరకు నిధులు ఇస్తే, భూసేకరణతో పాటు ఇతర నిర్మాణాలు పూర్తవుతాయని వివరించారు. దీంతో వెంటనే ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కావాల్సిన అంచనాలతో రిపోర్టు ఇవ్వాలని, 2027 డిసెంబరు నాటికి నిర్మాణం పూర్తి చేయాలని సీఎం అన్నారు. మార్చిలో ప్రత్యేక మంత్రివర్గ సమావేశం నిర్వహించి అన్ని అంచనాలకు ఆమోదం తెలుపుతామన్నారు. దేవాదుల పంపుల మరమ్మతులను ను నెలరోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి దేవాదులపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల భేసకరణ కోసం ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామని, పరిహారం చెల్లింపులను గ్రీన్ చానల్ ద్వారా వేగంగా మంజూరు చేస్తామని చెప్పారు. రామప్ప చెరువు నుంచి జంపన్న వాగుకు నీరందించే ప్రణాళికపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు మహబూబాబాద్ జిల్లా రెడ్యాలలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నేత వెన్నం రాఘవేంద్రరెడ్డి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు.

## సీఎంకు హార్వర్డ్ ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమానికి భారత్ నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి ఒక్కరే ఈ ఆహ్వానాన్ని అందుకోవడం విశేషం. ఈ సదస్సులో 'ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కంప్యూటర్ పవర్: ఇంపాక్ట్ ఆన్ లివబిలిటి అండ్ వర్క్‌ఫోర్స్' అనే ప్యానెల్‌లో ప్రసంగించాలంటూ రేవంత్‌ను ఆహ్వానించారు. ఈ సెషన్‌లో డేటా సెంటర్లు, ఎనర్జీ సిస్టమ్స్, కంప్యూట్ కారిడార్స్ ప్రభావంపై ప్రధానంగా చర్చ జరగనుంది. ఏఐ ఎకో సిస్టమ్ అభివృద్ధి, ఏఐ సిటీ అభివృద్ధి లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, భూమి, విద్యుత్, నైపుణ్యాలు, నియంత్రణ, పెట్టుబడుల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రసంగించేందుకు సీఎంను ప్రత్యేకంగా ఆహ్వానించారని అధికారులు తెలిపారు. ఇటీవల రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లిన సమయంలో నిర్వాహకులు ఆయనను ప్రత్యేకంగా కలిసి సింపోజియంపై చర్చించారు. ప్రభుత్వం, పరిశ్రమ, అకాడమీ రంగాల ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, ఏఐ పాలన, జియో పాలిటిక్స్, నాలెడ్జ్ ఎకానమీ, ఎనేబ్లింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశాలపై చర్చించేందుకు ఈ సింపోజియం నిర్వహిస్తున్నట్లు వివరించారు.



## భారీ ఉగ్ర కుట్ర భగ్నం!

- తమిళనాడు, బెంగాల్లో 8 మంది అరెస్టు
- హైదరాబాద్ చంచల్‌గూడ జైలు ములాఖత్‌లలో ఉగ్రకుట్రకు ప్లాన్..

న్యూఢిల్లీ, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 22: దేశంలో భారీ ఉగ్ర కుట్రను పోలీసులు భగ్నం చేశారు. పాకిస్థాన్‌కు చెందిన బంగాదేశ్ కేంద్రంగా పనిచేసే ఉగ్ర సంస్థల అండదండలతో ఢిల్లీలో విధ్వంసానికి ప్రణాళికలు రచించినట్లు అనుమానిస్తున్న 8మంది ఉగ్రవాదులను అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ లష్కరే తాయిబా పేలుళ్లకు కుట్ర పన్నిందన్న నిఘా వర్గాల సమాచారంతో భద్రతా సంస్థలు శనివారం అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. పక్కా సమాచారం, ఓ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఫిర్యాదు ఢిల్లీ పోలీసులు మేరకు తమిళనాడులోని పలు ప్రాంతాలు, పశ్చిమబెంగాల్లో అధికారులు సోదాలు చేపట్టారు. శనివారం తమిళనాడులో ఆరుగురిని, అంతకముందు పశ్చిమబెంగాల్‌లో మరో ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారణ నిమిత్తం ఢిల్లీకి తరలించారు. పట్టుబడిన వారిలో ఏడుగురు బంగాదేశీయులు కాగా, ఒకరు పశ్చిమబెంగాల్‌లోని మాల్దాకు చెందిన వ్యక్తి అని పోలీసులు తెలిపారు. వీరంతా భారతదేశంలోకి చొరబడి, నకిలీ ఆధార్ కార్డులు సంపాదించారని చెప్పారు. నిందితులంతా సోషల్ మీడియా ద్వారా ఒకరితో ఒకరు టచ్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఈ 8మందిలో నలుగురు వ్యక్తుల గ్రూపు దేశ రాజధానిలో ఏఐ సదస్సు జరుగుతున్న సమయంలో ఢిల్లీ, కోల్‌కతాలకు వెళ్లి.. పలు చోట్ల 'ఫ్రీ కశ్మీర్', ఉగ్రవాది బుర్హాన్ ఫొటోలు ఉన్న పాకిస్థాన్, ఉగ్రవాద అనుకూల పోస్టర్లను అంటించి, తిరిగి తమిళనాడు, పశ్చిమబెంగాల్‌కు వెళ్లిపోయారని అధికారులు చెప్పారు. బంగాదేశ్ నుంచి లష్కరే తాయిబా ఉగ్రవాది షబ్బీర్ అహ్మద్ ఆదేశాలతో పోస్టర్లు అంటించారని, ఇతను కశ్మీర్‌కు చెందిన వ్యక్తి అని తెలిపారు.

## ఐసెట్ కోసం డిజిటల్ ప్రసారాలు

(మొదటి పేజీ తరువాయి)

టీ-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఎనలిటిక్ ఎబిలిటీ, మ్యాథమెటిక్స్, కమ్యూనికేషన్ ఎబిలిటీ తదితర సబ్జెక్టులపై రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున ప్రసారం చేయనున్నామని, విద్యా చానల్‌లో ఉదయం 5 నుంచి 6 గంటల వరకు, నిపుణ చానల్‌లో సాయంత్రం 5–6 గంటల వరకు పాఠాలు ప్రసారమతాయని తెలిపారు.

## రాంచందర్‌రావు అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

ఠాణాకు తరలించారు. దీంతో ఆయన్ను విడుదల చేయాలని బీజేపీ కార్యకర్తలు పోలీసు స్టేషన్ ముందు ధర్నా చేశారు. మరోవైపు, కామారెడ్డికి బయలుదేరిన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్యలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు మురళీధర్ గౌడ్ పోలీసుల కన్నుగప్పి కామారెడ్డికి రావడంతో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. బాన్సువాడ వెళుతున్న మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీ బీబీ పాటిల్‌ను మార్గమధ్యలోనే పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బొల్లారం పోలీసు స్టేషన్‌లో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ చెప్పుచేతల్లో సర్కారు కొనసాగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం చేతిలో బందీగా మారిందని విమర్శించారు. పోలీసులు తనను అక్రమంగా అరెస్టు చేయడం, ముందస్తుగా గృహ నిర్బంధం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బాన్సువాడలో హిందువుల ఇళ్లపై జరిగిన రాళ్ల దాడి అత్యంత అమానుషమని అన్నారు. బాన్సువాడలో ఒక్క ఎంఐఎం కార్యకర్తను కూడా అరెస్టు చేయని పోలీసులు80మంది బీజేపీ, హిందూ సంఘాల కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. హిందూ సంఘాలపై, తమ పార్టీ కార్యకర్తలపై నమోదు చేసిన తప్పుడు కేసులను సహించబోమని తేల్చిచెప్పారు. తాను బాన్సువాడ వెళ్లి తీరతానని, బాధితులను పరామర్శిస్తానని చెప్పారు. నిష్పక్షపాతంగా, నిబద్ధతతో పనిచేయాలి తప్ప, కాంగ్రెస్ నేతల చేతుల్లో తోలుబొమ్మలా వ్యవహరించవద్దని సూచించారు. కాగా, రాంచందర్‌రావు అరెస్టును నిరసిస్తూ బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు తార్నాక చౌరాస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

**కామారెడ్డిలో చల్లారని వేడి..**

కామారెడ్డిలో కాంగ్రెస్, బీజేపీ మధ్య వివాదం సద్దుమణగలేదు. బాన్సువాడలో హింసాత్మక ఘటనలు, అదేవిధంగా శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఇంటి ముట్టడిని నిరసిస్తూ ఆదివారం చలో కామారెడ్డి, బాన్సువాడకు బీజేపీ పిలుపునిచ్చింది. దీంతో ఆ రెండు పట్టణాల్లో హై అలర్ట్ కొనసాగింది. కామారెడ్డిలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఇంటి వద్ద, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా తనపై చేసిన అవినీతి ఆరోపణలను సోమవారం కలెక్టరేట్‌లో అధికారుల సమక్షంలో ఆధారాలతో నిరూపించాలని కాంగ్రెస్ నేతలకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సవాల్ విసిరారు. ఎమ్మెల్యే సవాల్‌ను స్వీకరించిన కాంగ్రెస్ నేతలు ఆయన అవినీతి, అక్రమాలపై ఆధారాలతో వస్తామని ప్రకటించారు. దీంతో సోమవారం మళ్లీ ఏం జరుగుతుందోనని టెన్షన్ నెలకొంది.

## దేవ్‌జీ లొంగుబాటు!

(మొదటి పేజీ తరువాయి)

మేధావులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇటీవల ఆపరేషన్ కర్రెగుట్టల పేరిట వేలాది సాయుధ బలగాలను రంగంలో దింపి కేంద్రం మరోసారి మావోయిస్టుల మీద తీవ్ర ఒత్తిడి తెచ్చింది. దీంతో ప్రాణహాని లేకుండా చూస్తే లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నామనే సంకేతాలు దేవ్‌జీ తదితరుల నుంచి వచ్చినట్లు తెలుస్తోంది. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన మావోయిస్టుల్లో దేవ్‌జీ అంగరక్షకులు నలుగురు ఉండడం అనుమానాలకు తావిచ్చింది. ఆయన కదలికల సమాచారం నిఘా వర్గాలకు ఎప్పటికప్పుడు అందుతుందనే అనుమానాలు దీంతో బలపడ్డాయి. కాగా, మావోయిస్టుల లొంగుబాటును సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చూపాలని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దేవ్‌జీ లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ శకం ముగిసినట్లేనని ప్రజా సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. మరోవైపు మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతి ఆచూకీ ఇంకా లభించలేదని సమాచారం. ఆయన విదేశాలకు వెళ్లిపోయారనే ప్రచారం జరుగుతోంది.

**దేవ్‌జీ ఆయుధాల తయారీలో దిట్ట**

జగిత్యాల జిల్లా కోరుట్లలోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన తిప్పిరి వెంకట నర్సయ్య, గంగుబాయికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. వారిలో తిరుపతి పెద్ద కుమారుడు. తిరుపతి ఇంటర్మీడియట్ వరకు కోరుట్లలో చదువుకున్నారు. కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్న సమయంలో 1984లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. క్రమంగా మావోయిస్టు దళ నాయకుడిగా ఎదిగారు. దేవ్‌జీకి ఆయుధాల తయారీలో దిట్ట అనే పేరుంది. మావోయిస్టు మహిళా నాయకురాలు, నల్గొండ జిల్లాకు చెందిన సృజనను అజ్ఞాతంలోఉన్నప్పుడే పెళ్లి చేసుకున్నారు. పోలీసు ఎన్‌కౌంటర్‌లో ఆమె మృతిచెందారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి 2025 సెప్టెంబరులో నియమితులయ్యారు. ఇదిలా ఉండగా, పెదనాన్న దేవ్‌జీ తమకు కొండంత ధైర్యమని ఆయన తమ్ముడి కూతురు సుమ అన్నారు. అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలుస్తున్నాడన్న సమాచారంతో దేవ్‌జీ తమ్ముడు గంగాధర్, సుమ భావోద్వేగానికి లోనయ్యారు.

**మల్లా రాజిరెడ్డి లొంగుబాటు**

మావోయిస్టు పార్టీ తొలితరం అగ్రనేత మల్లా రాజిరెడ్డి అలియాస్ సత్తన్న అలియాస్ సంగ్రామ్ పోలీసులకు లొంగిపోయారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని శాస్త్రులపల్లికి చెందిన రాజిరెడ్డి మంథనిలో ఇంటర్ చదువుతూ 1975లో పీపుల్స్‌వార్ అనుబంధ ద్వారా విప్లవ రాజకీయాల్లో చేరారు. అనంతరం పీపుల్స్‌వార్ మంథని దళంలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లారు. దళ సభ్యుడిగా చేరిన రాజిరెడ్డి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో స్థాయికి ఎదిగారు.

## భయపడకండి..

(మొదటి పేజీ తరువాయి)

భేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పేరుతో ఇండ్లు కోల్పోతున్న మధు పార్క్ అపార్ట్‌మెంట్ బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇంఛార్జి కార్తీక్ రెడ్డి తదితరులు కలిసి పరామర్శించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపిన హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మేం మూసీ శుద్ధికి వ్యతిరేకం కాదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఎస్టీపీలు కట్టు, మురుగునీరు రాకుండా చెయ్, కేసీఆర్ కట్టిన కాళేశ్వరం పైపులైనతో గోదావరి నీళ్లతో మూసీని శుద్ధి చెయ్. కానీ మూసీ అభివృద్ధి పేరిట పేదల ఇండ్లు కూల్చడాన్ని మాత్రమే మేం వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. బాపు ఘాట్ వద్ద అహింసా మూర్తి గాంధీ విగ్రహం పెట్టి ఆరాధించాలి తప్ప.. ఆ విగ్రహం, నిర్మాణం పేరిట ప్రజల ఇండ్లు కూల్చుతూ, హింసాత్మక మార్గంలో భయాందోళనలకు గురిచేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇండ్లు కూల్చడమంటే ఇక్కడి బతుకులను కూల్చడమే అని స్పష్టం చేశారు. పసిపిల్లలు కంటిమీద కునుకు లేకుండా రేపు పరీక్షలు ఎలా రాస్తారని ప్రశ్నించారు.

## ఏపీలో భారత్ నెట్ అమలు కోసం కేంద్రంతో కీలక ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

ఏబీపీ కోసం ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో SPVని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. డిజిటల్ భారత్ నిధి – రాష్ట్ర ప్రభుత్వం పరస్పర అంగీకారంతో నిధులు సమకూర్చి ప్రాజెక్టు అమలు చేసేలా చర్యలు చేపట్టింది. సీఎం చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో డిజిటల్ భారత్ నిధి – ఏపీ ప్రభుత్వం మధ్య ఎంఓయూ కుదిరింది. MoCపై డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ఐ అండ్ ఐ శాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు సంతకాలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ ఇన్‌ఫ్రా బలోపేతం, గ్రామ పంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని అందించేలా సహకార ఒప్పందం చేసుకుంది. రైట్ ఆఫ్ వే అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, క్షేత్ర స్థాయి సమన్వయానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించనుంది. ఏపీ వ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీలలో ప్రాజెక్టు అమలు చేసేలా ప్రణాళికలు చేసింది. 1,692 ఫేజ్–I పంచాయతీల్లోని నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేయడం, 11,254 ఫేజ్–IIలోని గ్రామాల డిజటల్ కనెక్టివిటీని పూర్తి చేయడం.. ఇక కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కనెక్టివిటీ ఇచ్చేలా చర్యలు చేపట్టింది. 3942 గ్రామాల్లో డిమాండ్ ఆధారంగా లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంచే అంశంపై ఏపీ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. డిజిటల్ కనెక్టివిటీ ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈ–గవర్నెన్స్ వంటి సేవలను మరింత బలోపేతం చేసేలా ఏపీ సర్కార్ ప్రణాళికలను రూపొందించింది.




# మల్కాజిగిరి నియోజకవర్గ పెరికకుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 22(వార్త వేదిక సూర్య):**
గ్రేటర్ హైదరాబాద్ పెరిక పురగిరి క్షత్రియ కుల సంఘం అధ్యక్షులు డాక్టర్ బొలిశెట్టి సతీష్ వర్మ అధ్యర్యంలో న్యూ మిర్జలగూడ మల్కాజిగిరి లోని దిడ్డి రాజు నివాసంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిలుగా రాష్ట్ర అధ్యక్షులు గటిక విజయ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొంగరి మనోహర్ విశిష్ట అతిథులుగా గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రాందేని నారాయణ, ఆర్థిక కార్యదర్శి గోపతి రాజేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బిట్టు మల్లికార్జున రావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు(=ఎ), రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు దాసరి జయప్రకాష్, రాష్ట్ర యువజన విభాగం చీఫ్ అడ్వైజర్ మాడిశెట్టి శ్రీధర్, రంగారెడ్డి జిల్లా ప్రచార కార్యదర్శి మేకల మహేష్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్షులుగా దిడ్డి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులు గోళ్ల రాజశేఖర్, అసోసియేట్ అధ్యక్షులు మంచాల సురేష్, ప్రధాన కార్యదర్శి మైదంశెట్టి శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి తోట రాజేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా సింగతి శశి కుమార్ ను నియమించారు. అనంతరం వారిని రాష్ట్ర కమిటీ మరియు నియోజకవర్గ సంఘ నేతలు ఘనంగా శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుల సంఘం నేతలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## కాటేదాన్ డివిజన్‌లో మోదీ 'మన్ కీ బాత్' వీక్షణ

### పాల్గొన్న అధ్యక్షులు గోద పాండు యాదవ్

**మైలర్ దేవ్ పల్లి, ఫిబ్రవరి 22 ( వార్త వేదిక సూర్య ) :**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి నెల నిర్వహించే 'మన్ కీ బాత్' (మనసులో మాట) కార్యక్రమం ఆదివారం నాటికి 131వ విడతకు చేరుకుంది. ఈ సందర్భంగా కాటేదాన్ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్ 379 మరియు 355లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గోద పాండు యాదవ్ పాల్గొని ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా పాండు యాదవ్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో సామాన్యుల పాత్రను, సమాజంలోని వినూత్న మార్పులను ప్రధాని ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచానికి చాటిచెబుతున్నారని కొనియాడారు. బూత్ స్థాయిలో కార్యకర్తలు, ప్రజలు కలిసి ప్రధాని మాటలను వినడం వల్ల సామాజిక బాధ్యత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.





## మహిళా సాధికారతపై విద్యార్థుల కలం పోరు: ఘనంగా వ్యాసరచన పోటీలు

- రాజేంద్రనగర్ నియోజకవర్గంలో వెల్లువెత్తిన స్పందన
- నవ యువ యూత్ క్లబ్, మానవ సేవే మాధవ సేవా ఆధ్వర్యంలో నిర్వహణ
- మార్చి 8న విజేతలకు బహుమతుల ప్రదానం



**మైలర్ దేవ్ పల్లి, ఫిబ్రవరి 22 (వార్త వేదిక సూర్య) :**
అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేలా నిర్వహించిన వ్యాసరచన పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. స్థానిక నవ యువ యూత్ క్లబ్ మరియు మానవ సేవే మాధవ సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని భావన ఋషి కాలనీలో గల శ్రీ మార్కండేయ ట్రస్ట్ భవనంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

మహిళ – సమాజ ప్రగతి' అనే ప్రధాన ఇతివృత్తంపై నిర్వహించిన ఈ పోటీల్లో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. మారుతున్న కాలంలో మహిళల పాత్ర, వారి ఎదుగుదల, వారు ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు సాధికారత వంటి అంశాలపై విద్యార్థులు తమ విజ్ఞానాన్ని వ్యాసాల రూపంలో అద్భుతంగా పొందుపరిచారు. నియోజకవర్గంలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల భాగస్వామ్యంతో ట్రస్ట్ భవనం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ఏర్వ కుమారస్వామి, గొంత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేటి తరం యువతలో మహిళల పట్ల గౌరవాన్ని పెంపొం దించడమే కాకుండా, వారిలో దాగి ఉన్న సృజనా త్మకతను వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. సమాజంలో స్త్రీ శక్తి ప్రాముఖ్యతను చాటిచెప్పేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల వ్యాసాలను నిష్పాక్షికంగా పరిశీలించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని విజేతలుగా ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఎంపికైన విజేతలకు మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే ప్రత్యేక వేడుకలో ఘనంగా బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సామల యాదయ్య, కీలుగు దినేష్, హేమలత, వనజ, మౌనిక విద్యార్థులు పాల్గొన్నారు.





## ప్రయాణంలోనూ 'మన్ కీ బాత్' వీక్షించిన బీజేపీ నేత ఆడికే మహేందర్

**మైలర్ దేవ్ పల్లి, ఫిబ్రవరి 22 ( వార్త వేదిక సూర్య ) :**
ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని బీజేపీ సీనియర్ నాయకులు ఆడికే మహేందర్ ఆసక్తిగా వీక్షించారు. ఆదివారం ఆయన ప్రయాణంలో ఉన్నప్పటికీ, ప్రధాని ప్రసంగాన్ని మిస్ అవ్వకూడదనే ఉద్దేశంతో తన మొబైల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని, సామాన్యుల విజయగాథలను ప్రపంచానికి చాటిచెప్పడంలో 'మన్ కీ బాత్' ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తోందని కొనియాడారు. దేశం నలుమూలల జరుగుతున్న సామాజిక మార్పులను ప్రధాని ఈ కార్యక్రమం ద్వారా వివరిస్తూ అందరిలో స్ఫూర్తి నింపుతున్నారని ఆయన పేర్కొన్నారు.

## మాజీ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ ను కలిసిన బిఎస్ మక్త మహిళ నాయకులు



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 22(వార్త వేదిక సూర్య):**
సోమాజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్‌ను ఆదివారం బిఎస్ మక్తకి చెందిన మహిళలు ఆయనా ఆఫీస్‌లో మర్యాద పూ ర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మహిళలను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా ఆయనా మాట్లాడుతూ. అర్హులైన ప్రతి ఒకరికి వచ్చే నెలలో ఇందిరమ్మ మరియు డబల్ బెడ్ రూమ్ ఇవ్వడా నికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పని చేస్తుందని పేర్కొన్నారు. ఇంకా ఏమైనా సమస్య ఉంటే నా దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆ సమస్యను అధి కారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తా నని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ కాం గ్రెస్ పార్టీ మహిళ నాయకురాలు సరిత తదితరులు పాల్గొన్నారు.



## వద్దిపట్లలో ఘనంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట

**దేవరకొండ ఫిబ్రవరి 22 ( వార్త వేదిక సూర్య ):**
నల్గొండ జిల్లా పెద్ద అడిచర్లపల్లి మండలంలోని వద్దిపట్ల గ్రామంలో దళితవాడలో వెలిసిన ముత్యాలమ్మ విగ్రహానికి ఆ కాలనీ ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. రానున్న రోజులలో గుడి ఏర్పాటు చేసుకుని పెద్ద ఎత్తున జాతర కార్యక్రమాలు నిర్వహిస్తామని దళిత నాయకుడు దున్న ముత్యాలు అన్నారు. ఆ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ గ్రామం పై ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దున్న వెంకటయ్య దున్న ఆంజనేయులు మల్లేపల్లి కరుణాకర్ విజయ్ కుమార్ మహేష్ దుబ్బ అంజి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## మురళి కృష్ణ కుటుంబానికి ఉద్యోగస్తుల అండ

- రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేత
- మానవత్వం చాటుకున్న నాన్-టీచింగ్ అసోసియేషన్..
- దివంగత ఉద్యోగి కుటుంబానికి చేయూత

**మైలర్ దేవ్ పల్లి, ఫిబ్రవరి 22 ( వార్త వేదిక సూర్య ) :**
గ్రేప్ రీసెర్చ్ స్టేషన్‌లో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తూ, ఇటీవల అకాల మరణం చెందిన కొరని మురళి కృష్ణ కుటుంబాన్ని నాన్-టీచింగ్ అసోసియేషన్ సభ్యులు పరామర్శించి, తమ ఉదారతను చాటుకున్నారు. మురళి కృష్ణ కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో రాజేంద్రనగర్ హార్టికల్చర్ కాలేజీలోని టీచింగ్ మరియు నాన్-టీచింగ్ ఉద్యోగులందరూ కలిసి విరాళాలు సేకరించారు. సేకరించిన రూ. 20,516/- నగదును నేడు చెక్కు రూపంలో మురళి కృష్ణ భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా నాన్-టీచింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... మురళి కృష్ణ మరణం మా అందరికీ తీరని లోటు. వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించడంతో పాటు, భవిష్యత్తులో కూడా నాన్-టీచింగ్ అసోసియేషన్ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాన్-టీచింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పోతురాజు యాదయ్య, కార్యదర్శి ఎ. చెంచురామయ్య, వైస్ ప్రెసిడెంట్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రజనీ కాంత్, మినిస్టీరియల్ సెక్రెటరీ కే. ముకేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి. శ్రావణ్ కుమార్ . వీరితో పాటు కే. బెంజమిన్, వెంకటస్వామి, పేరి రెడ్డి, చంటి, హరి కృష్ణ మరియు ఆనంద్ తదితరులు హాజరై కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.





చింతపల్లి మండలంలోని పీకే మల్లేపల్లి గ్రామంలో ఆదివారం నాడు నిర్వహించిన హజ్రత్ అబ్బాస్ దర్గా షరీఫ్ 57వ ఉరుసు కార్యక్రమంలో పాల్గొని, దర్గాను దర్శించుకోని,గంధాన్ని సమర్పించిన సూర్యాపేట శాసన సభ్యులు మాజీ మంత్రి వర్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి గారిని బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్త్య రమేష్ కలిసినారు.

-దేవరకొండ ఫిబ్రవరి 22 (వార్తా వేదిక సూర్య )

## మహిళ సంఘం భవన నిర్మాణనికి శంకుస్థాపన

### మహిళ సంఘం భవన నిర్మాణనికి శంకుస్థాపన



**గట్టుప్పల, ఫిబ్రవరి 22 ( వార్త వేదిక సూర్య ) :**
గట్టుప్పల మండలంలోని వెల్మకన్నె గ్రామంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ.10 లక్షల వ్యయంతో మహిళ సమాఖ్య సంఘ భవన నిర్మాణానికి,రూ.2 లక్షలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ రావుల స్వప్న రమేష్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. మహిళల అభివృద్ధి లక్ష్యంగా పాఠశాల పరిశుభ్రత విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని సర్పంచ్ రావుల స్వప్న రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగబోయిన మహేష్, వార్డు సభ్యులు,విద్యా కమిటీ చైర్మన్,ఉపాధ్యాయులు,మహిళా సంఘ ప్రతినిధులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 28 న మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- పల్లా దేవేందర్ రెడ్డి
- తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి




**నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 22 (వార్తా వేదిక సూర్య )**
ఈనెల 28 వ తేదీన వరంగల్ లో జరుగుతున్న ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ గార్డ్ కార్మికుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా మెడికల్ కాంటాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికులుగా పనిచేస్తున్న పర్మినెంట్ కు నోసుకోలేదని నేటికీ శ్రమదోపిడికి గురవుతున్నారని కావున ఆసుపత్రి కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత లేకున్నా అరకొర వేతనాలతో ఏజెన్సీ కాంట్రాక్టర్ల శ్రమ దోపిడీకి గురవుతున్న ప్రభుత్వ ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ కార్మికులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందించడమే కాకుండా ఆసుపత్రి స్వచ్ఛతకు చిహ్నంగా నిలుస్తున్నారని అన్నారు. ఇలాంటి సిబ్బంది జీవితాలకు భరోసాగా నిలవాల్సిన ప్రభుత్వ అధినేతలు నోటితో పొగుడుతూ నొసటితో వెక్కిరించే ద్వంద ఆర్థిక విధానాలను అవలంబిస్తున్నారని మండిపడ్డారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సమాన పనికి సమాన వేతనం అందించాలని తీర్పు ఇచ్చి దశాబ్దాలు గడుస్తున్న కోర్టు తీర్పులను కూడ అమలు చేయకపోవడం ఎంతో బాధాకరమని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ వైద్యరంగంలో ఏజెన్సీల విధానం ద్వారా కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సిబ్బంది వేతనాలు అందిస్తున్నారని దీనిద్వారా ఏజెన్సీల కాంట్రాక్టర్లు లబ్ధి పొందుతున్నారే తప్ప ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులు వారి సంక్షేమం ప్రభుత్వ ఖజానా గణాంకాల్లో లెక్కలు తప్ప క్షేత్రస్థాయిలో కాంట్రాక్టు సిబ్బంది జీవన విధానం విధ్వంసం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఏజెన్సీల విధానం రద్దుచేసి తక్షణమే కార్పొరేషన్ ద్వారా నేరుగా కార్మికులకు జీతభత్యాల అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలతో పోల్చుకుంటే హాస్పిటల్ కార్మికులకు వచ్చే వేతనాలు ఏమాత్రం సరిపోవటం లేదని టెండర్ల కాలపరిమితి ముగిసిన నేటికీ పాత టెండర్లను కొనసాగిస్తూ తక్కువ వేతనాలతో పని చేయిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే కొత్త టెండర్లు పిలిచి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల సాధనకై ఈ నెల 28న వరంగల్ జిల్లా కేంద్రంలో వేలాదిమందితో భారీ ప్రదర్శన కార్మిక సభను ఏర్పాటు చేస్తున్నామని కనుక వరంగల్ సభకు మెడికల్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సిబ్బంది పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి విశ్వనాథులు లెనిన్ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు ఏం యాదగిరి సిహెచ్ నిర్మల పి ఎల్లమ్మ పద్మ ఏ రామేశ్వరమ్మ అన్నపు లింగస్వామి సందీప్ మధు సబిత కే నిర్మల ఉషమ్మ యాదమ్మ, ఏ శ్రీదేవి డి అరుణ ఇంద్రమ్మ యమునా టి పద్మ పుష్పలత కళావతి సుజాత శిల్ప బుజ్జి సునీత రజిత కృష్ణమ్మ ధనమ్మ అండాలు సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య || హైదరాబాద్ సోమవారం, ఫిబ్రవరి 23, 2026 ||

# చింతల యువసేన ఆధ్వర్యంలో చింతల వెంకటేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**భువనగిరి ఫిబ్రవరి 22/వార్త వేధిక సూర్య :**
బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి జన్మ దిన వేడుకలు చింతల యువసేన మరియు వారి అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు మరియు బ్రెడ్ పంపిణీ చేసి అనంతరం రాయగిరిలోని సహృదయ అనాథ వృద్ధ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భం గా మాట్లాడుతూ చింతల వెంకటేశ్వర రెడ్డి కి శుభా కాంక్షలు తెలియజేస్తు ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకో వాలని కోరుకుంటూ, శ్రీ యాదాద్రి లక్ష్మీనృసింహ స్వామి వారి ఆశీస్సులతో భవిష్యత్తులో వారు ఎన్నో అత్యున్నత పదవులు అధిరోహించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వలపు విజయ్, దండబోయిన బలరాజ్ యాదవ్, గాజుల నవీన్, పల్లెపాటి రవికుమార్, ఎలిమినేటి మహేంద్ర రెడ్డి, దోషపాటి హరీష్, కూదే శ్రీశైలం, మోతే మనోహర్, నాగారం నరేష్, చింతల యువసేన నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**మోత్కూరు, ఫిబ్రవరి 22 (వార్తా వేదిక సూర్య )**
మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని వివేకానంద విద్యా మందిర్ 2005- 2006 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ను స్థానిక ఎన్ ఎస్ స్పోర్ట్స్ క్లబ్ మినీ ఫంక్షన్ హాల్ లో ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి వారి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి వివేకానంద పాఠశాల క్రమశిక్షణకు మారుపేరని గుర్తు చేశారు. అప్పటి అధ్యాపక బృంధం నేర్పిన విద్యాబుద్ధులతోటి ఉన్నత స్థాయిలో నిలిచినట్లు వారి అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమానికి ముందుగా ఈత కారణాలతో ఆకాల మరణం పొందిన ఉపాధ్యాయులు నాగవెల్లి నాగభూషణం, జయశ్రీ, నాగవెల్లి రఘుమోహన్, అశోక్, జనార్దన్ తో పాటు, పూర్వ విద్యార్థులు గంట దిలీప్ రెడ్డి, కొణతం నిశాంత్ రెడ్డి లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం బిట్ల ఆనంద్, సురిగల రామచంద్రు, బాసాని రాములు, పోలోజు వెంకటేష్, మొయిద్దీన్ పాషా, మాశెట్టి వెంకన్న, నాగవెల్లి మాధవ్, నాగవెల్లి భార్గవ్, నాగవెల్లి రాజలక్ష్మి, రాజిడి జ్యోతి, ఎండి కుబ్రాభి, ఎస్.కే విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అధ్యాపక బృందాన్ని శాలువాలతో సన్మానించారు.









# కుమ్మెరలో కుల దురహంకార ఘటన కారకులను శిక్షించాలి : ఏంఎన్ఎస్

- హైదరాబాదులో మూఢనమ్మకాల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో నిరసన
- పాల్గొన్న ఎమ్ఎన్ఎస్ యూత్ జతీయ ప్రధాన కార్యదర్శి గోమాస సందీప్
- నారాయణపేట జిల్లా ఏంఎన్ఎస్ ప్రధాన కార్యదర్శి అశోక్ చక్రవర్తి, ప్రచార కార్యదర్శి లక్ష్మికాంత్

**హైదారాబాద్/వార్త వేధిక సూర్య :**
నాగర్ కర్నూల్ జిల్లా, కుమ్మెర గ్రామంలోనీ మల్లన్న జాతరలో చాకలి సామాజిక వర్గానికి చెందిన కుటుంబం పైన రెడ్డి సామాజిక వర్గం వారు చేసిన దాడినీ కడుస్తున్నం అని వాటి కారకులను కఠినంగా శిక్షించాలని ఎమ్ ఎన్ ఎస్ యూత్ జతీయ ప్రధాన కార్యదర్శి గోమాస సందీప్,నారాయణపేట జిల్లా ఏం ఎన్ ఎస్ ప్రధాన కార్యదర్శి అశోక్ చక్రవర్తి, ప్రచార కార్యదర్శి లక్ష్మికాంత్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఘటన నిరసిస్తూ మూఢనమ్మకాల నిర్మూలన సంఘం ఏం ఎన్ ఎస్ బోరబండ సోపతి క్లబ్, బోరబండ అంబేద్కర్ సంఘం ఆద్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ కుమ్మెరలో జరిగిన కుల వివక్ష సంఘటనలో 2 నెలలా పసికందు చనిపోవడం జరిగింది.76 సంవత్సరాల స్వతంత్ర భారత దేశంలో ఇప్పటికీ కుల వివక్ష సంఘటనలు జరగడం ఎంతో సిగ్గు చేటు. భూస్వామ్య అగ్రకుల రెడ్డి కులస్థుల మూకుమ్మడిగా చాకలి కులస్థులు ప్రశ్నించినందుకు నువ్వు ఏందీ! నీ లెక్క ఏందీ! నీ కులం ఏందీ! అనుకుంటూ అనరాని మాటలు అనుకుంటూ మూకుమ్మడిగా దాడి చేశారు. అందులో 6 గంటల దాకా కొట్టడం అనేది అతి దారుణం అయిన చర్య. కులం లేదు అందరూ సమానం అనే యువక్కుల్లరా ఇప్పుడు చెప్పండి ఎలా ఉంది మన భారతదేశం అని ప్రశ్నించారు.మొన్న జెండాలు పట్టుకొని జయంతి ఉత్సవాలను శోభాయాత్రలు చేసినా మీరు ఎందుకు మరి ఇవ్వాళ అదే జెండాలు పట్టుకొని బయట నిరసన కార్యక్రమాలు చేసి ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయడం లేదనీ ప్రశ్నించారు .బహుజన దళిత గిరిజనమైనార్టీయువక్కుల్లార మీరు పట్టుకునే జెండా మీలో ధైర్యాన్ని, ప్రశ్నించే తత్వాన్ని , మహనీయుల ఆలోచనలు నేర్పుతుంది.అందుకే ఇప్పటికైనా మీ జెండాను ఎజెండాను మార్చుకుని బయటకు వచ్చి మీ కుటుంబాలను మీ చదువులను పూర్తి చేసి ఈ సమాజానికి స్ఫూర్తి వంతంగా మారండి. ఇటువంటి ఘటనలను జరగకుండా చూడాల్సిన రక్షణ వ్యవస్థే కావాలని అగ్రకులస్థులకు వత్తాసు పలకడం రాజ్యాంగానికి విరుధమైన చర్య అని అన్నారు .. ఈ కుల అహంకారంతో జరిగిన దాడిలో గాయ పడిన కుటుంబాలకు తక్షణమే న్యాయం జరగాలి దాడి చేసిన కుల గజ్జి కుక్కలను వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజలు అందరూ అప్రమత్తం అయ్యి రాష్ట్రం మొత్తం నిరసనలు చేయలని ప్రజలను కోరారు.బాధితులకు అండగా ఉండాల్సిన రక్షణ వ్యవస్థ నిందితులకు వత్తాసు పలుకుతూ బాధితులపై తప్పుడు కేసులు పెట్టిన స్థానిక రక్షణ వ్యవస్థలో ఉన్న అధికారాలను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.అక్కడ జరిగిన కుల దుర అహంకారంతో జరిగిన ఘటనను పోలీసులు దర్యాప్తు చేయకుండా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం కి అప్పగించడంతో పాటు అందులోకి రాష్ట్రంలోని బహుజన నాయకులు ఆధ్వర్యంలో ఆ దర్యాప్తు జరగాలని బోరబండ అంబేద్కర్ సంఘం సూచించింది .ఈ కార్యక్రమంలో ఏం ఎన్ ఎస్ యూత్ మిత్రులు గోమాస రమ్య శ్రీ, రవికిషన్, బోరబండ అంబేద్కర్ సంఘం నాయకులు ఎడి కురుమయ్య, టీ వెంకటేష్, రామ్ చందర్ గైక్వాడ్, బాలరాజ్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగు రాజు ముదిరాజ్



**మొయినాబాద్ మున్సిపాలిటీ ఫిబ్రవరి 22 (వార్తా వేదిక సూర్య)**
మొయినాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగు రాజు మున్సిపల్ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మేనిఫెస్టోలో పేర్కొన్న 'రాజన్న బరోసా' పథకం అమలులో భాగంగా జీఆర్ ఫౌండేషన్ ద్వారా మంగలి శాంతమ్మ 2వ కుమార్తెకు రూ.51,000 చెక్కును తన వంతు ఆర్థిక సహాయంగా పెళ్లిలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు అండగా నిలబడటమే నా లక్ష్యమని మాట ఇస్తే మడమ తిప్పిన నీ తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నాయకులు స్థానికులు గ్రామాల్లో ఆపదలో ఉన్న వారికి నేను ఉన్న అనే భరోసా ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని గ్రామస్తులు ప్రశంసించారు.

# పాటిమట్ల, దాచారంలలో సమభావన సంఘాలకు భవనాలు మంజూరు

**మోత్కూరు, ఫిబ్రవరి 22( వార్త వేదిక సూర్య )**
మండలంలోని పాటిమట్ల, దాచారం గ్రామాలలో సమభావన సంఘాల కోసం భవనాలు మంజూరయ్యాయని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సమభావన సంఘాల కోసం భవనాలు నిర్మించేందుకు ఉపాధి హామీ పథకం నుండి ఒక్కో భవనానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయని అన్నారు.. సమభావన సంఘాలకు భవన నిర్మాణాల కోసం స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ చొరవతో మంజూరు అయ్యాయని ఈ భవనాలకు నిధులు మంజూరు సహరించిన ఎమ్మెల్యే సామేల్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





# శ్రీసాయి గాయత్రి పెట్రోల్ బంక్‌లో కనీస వసతులు కల్పించాలి

**మోత్కూరు, ఫిబ్రవరి 22 (వార్తా వేదిక సూర్య)**
మండలంలోని పాలడుగు గ్రామంలో శ్రీసాయి గాయత్రి పెట్రోల్ బంక్ లో గాలి పంపు, మంచినీటి వసతి,కరెంట్ లేని సమయంలో జనరేటర్ పని చేయడం లేదు.అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రజలు త్రీవ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేసి ప్రజలకు అందుబాటులో పెట్రోల్, డీజిల్ అందించాలని గ్రామస్తులతో పాటు స్థానిక సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు.

# యూరియా యాప్ విధానంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి

**పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ భీమిడి చిన్న వెంకట్ రెడ్డి**



**చిట్యాల రూరల్, ఫిబ్రవరి 22,**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా యాప్ విధానం రైతులకు ఇబ్బందులు కలిగిస్తోందని రైతు బంధు సమితి గుండ్రాంపల్లి గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ భీమిడి చిన్న వెంకట్ రెడ్డి తెలిపారు. యాప్‌లో నమోదు చేసిన కొద్ది నిమిషాల్లోనే యూరియా స్టాక్ ఖాళీగా చూపించబడుతోందని, దీంతో రైతులు ఎరువు పొందడంలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంట కీలక దశలో సరైన సమయంలో యూరియా చల్లకపోవడంతో వరి చేనుల ఎదుగుదల దెబ్బతిని, పంట దిగుబడి తగ్గే పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక అవగాహన లేమి కారణంగా అనేక మంది రైతులు యాప్ వినియోగంలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యూరియా యాప్ విధానంపై పునరాలోచన చేయాలని, పాత విధానంలోనే ఎరువుల దుకాణాల ద్వారా యూరియా పంపిణీ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా వ్యవస్థను సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# భక్తితో వచ్చిన వాళ్ళని కులం పేరుతో దూషించడం సిగ్గుచేటు

- మూఢనమ్మకాల నిర్మూలన సంఘం నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు పొలమూరు రాజు
- పసిపాప చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి : ఏం ఎన్ ఎస్ గద్వాల జిల్లా అధ్యక్షులు ఏదుల నాగరాజు



**నాగర్ కర్నూల్ /వార్త వేధిక సూర్య :**
భక్తి పేరుతో వచ్చిన వాళ్ళని కులం పేరుతో దూషించడం సిగ్గు చేటనీ మూఢనమ్మకాల నిర్మూలన సంఘం నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు పొలమూరు రాజు అన్నారు . నాగర్ కర్నూలు జిల్లా కుమ్మర గ్రామంలో మల్లన్న జాతరలో చాకలి సామాజిక వర్గానికి చెందిన కుటుంబంపై రెడ్డి సామాజిక వర్గం వారు చేసిన దాడినీ నిరసిస్తూ వారు ఏం ఎన్ ఎస్ టీం తో కలిసి ఘటన జరిగిన గ్రామానికి చేరుకుని బాధితులతో కలిసి మాట్లాడి వారికి ధైర్యం చెప్పి వారికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలలో ఉన్న భక్తిని ఆసరాగా చేసుకొని దోపిడీ చేయడం అమానుషం అని. పసికందుని చంపిన వాళ్లను వెంటనే జైలుకు పంపాలి. నిర్లక్ష్యంగా ఉన్న పోలీసు అధికారులను విధులనుంచి తొలగించాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దేవస్థాన కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారా.ఈ కార్యక్రమంలో గద్వాల జిల్లా అధ్యక్షులు ఏదుల నాగరాజు , తిమ్మాజిపేట జిల్లా అధ్యక్షులు బావాజీ పల్లి వంశీ , నాగర్ కర్నూలు జిల్లా యూత్ అధ్యక్షులు దాటి మల్ల శ్రీకాంత్ , విజయ్ , సంకి రాములు, సంఘ నాయకులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# నేడు మున్సిపల్ పాలకవర్గం బాధ్యతలు స్వీకరణ

మోత్కూరు, ఫిబ్రవరి 22 ( వార్తా వేదిక సూర్య); ఈనెల 23న ఉదయం 9:30 గంటలకు మోత్కూరు మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ లతో పాటు ఎన్నికైన కౌన్సిలర్లు (పాలకవర్గం ) బాధ్యతలు స్వీకరణతో పాటు కౌన్సిల్ సమావేశం జరగనున్నదని మున్సిపల్ చైర్మెన్, గడ్డం స్వప్న, సోమ నర్సయ్య, వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు విజయోత్సవ ర్యాలీతో పాటు కార్నర్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాలకు స్థానిక శాసనసభ్యులు మందుల సామేల్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని , కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మహిళ, ఎన్ ఎస్ యు ఐ, యూత్ కాంగ్రెస్ ఐ.ఎన్.టి.యు.సి కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘ నాయకులు సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# వనపర్తి జాయింట్ కలెక్టర్ కీమ్యా నాయక్‌ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన యాకయ్య



**మోత్కూరు, ఫిబ్రవరి 22 (వార్తా వేదిక సూర్య);**
వనపర్తి జాయింట్ కలెక్టర్ గా పనిచేస్తూ, ఐ ఏ ఎస్ గా పదోన్నతి పొందిన ఖీమ్యా నాయక్ ని యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకి చెందిన అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుంగపట్ల యాకయ్య ముదిరాజ్ ఆదివారం హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి పదవులు మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు.




## నూతన వధూవరులను ఆశీర్వదించిన నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**దేవరకొండ ఫిబ్రవరి 22 (వార్తా వేదిక సూర్య):** చింతపల్లి మండలం తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి గారి అన్న గారైన ఉలుపాల సునిత కీ"శే శ్రీనివాస్ రెడ్డి కూతురు అంజలి–కార్తీక్ రెడ్డి గార్ల వివాహానికి నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.








# గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవా లాల్

- ఆ మహనీయుడి అడుగుజాడల్లో పయనించాలి
- బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ ఫిబ్రవరి 22 ( వార్త వేదిక సూర్య ):** గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ కొనియాడారు. హైదరాబాద్ గుర్రంగూడ లో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ మహనీయుడి అడుగుజాడల్లో పయనించాలని పిలుపునిచ్చారు. యావత్ భారతదేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్త సేవాలాల్ మహారాజ్ అంటూ అభివర్ణించారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కారు గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికారంగా నిర్వహించిందని గుర్తు చేశారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేసిందన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించి గిరిజనులకు రాజ్యాధికారంలో కీలక భాగస్వామ్యం చేసిన ఘనత కేసీఆర్ దేనని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో బంజారాహిల్స్‌గా పిలుచుకుంటున్న ప్రాంతంలో మూడు శతాబ్దాల క్రితమే సేవాలాల్ మహారాజ్ నడయాడారని, అదే బంజారాహిల్స్ నేలమీద వారి పేరుతో నిర్మించిన భవన్‌లో బీఆర్ఎస్ సర్కార్ అధికారికంగా నిర్వహించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవిస్తే అణగారిన వర్గాల అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి తగిన గుర్తింపు దక్కుతుందనడానికి వారి జయంతి ఉత్సవాల నిర్వహణ మరో ఉదాహరణగా నిలిచిందని పేర్కొన్నారు. అడవి బిడ్డల ప్రత్యేకమైన ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక దృక్పథం, సామాజిక సాంస్కృతిక జీవన విధానాన్ని కాపాడటానికి సేవాలాల్ మహారాజ్ చేసిన కృషి గొప్పదని వెల్లడించారు. తన ప్రజలను బయటి సమాజం నుంచి అనుక్షణం రక్షించుకొనే దిశగా సంత్ సేవాలాల్ జీవితాంతం పోరాటం సాగించారని పేర్కొన్నారు. ఆ దిశగా వారు కల్పించిన చైతన్యం, వారు చేపట్టిన కార్యాచరణ దేశవ్యాప్తంగా ఉన్న లంబాడా/బంజారాలకు రక్షణ కవచంగా నిలిచిందని వివరించారు. బంజారాలకు స్ఫూర్తి ప్రదాతగా నాటి కాలంలో వారు చేసిన కృషి, విశ్వవ్యాప్తంగా ఉన్న బంజారాలకు వారిని ఆధ్యాత్మిక గురువుగా, తమ ఆరాధ్య దైవంలా కొలిచేలా చేసిందని గుర్తుచేశారు. గిరిజన బిడ్డల ఆత్మగౌరవం పరిఢవిల్లేలా వారి ప్రతిభను చాటేందుకు, ఉద్యోగ, ఉపాధి, విద్య, క్రీడలు తదితర రంగాల్లో బీఆర్ఎస్ సర్కారు అనేక కార్యక్రమాలను నిర్వహించిందని చెప్పారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున, అత్యంత ఖరీదైన ప్రాంతంలో సంత్ సేవాలాల్ మహారాజ్ పేరుతోనే బంజారా భవన్‌ను వారి ఆత్మగౌరవం ఉట్టిపడేలా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందని తెలిపారు. ఇందులో సంత్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన చేసిందన్నారు. గిరిజనులంతా ఐకమత్యంతో మెలిగి పార్టీలకు అతీతంగా కృషి, పట్టుదలతో పరస్పర సమన్వయంతో పనిచేసి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం రోజు కొండమల్లె పల్లి మండలం పట్టణ యువత బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ గారిని తమ నివాసం దేవరకొండలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నవీన్, మురళి రాజు హరీష్, సత్యం, మణికంం, ఆంజనేయలు, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

– దేవరకొండ, ఫిబ్రవరి 22, వార్త వేదిక సూర్య



## జేబీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణం పూర్తి

**సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి**

**దేవరకొండ ఫిబ్రవరి 22 (వార్తా వేదిక సూర్య ):** కొండమల్లేపల్లి పట్టణంలో జేబీ కాలనీలో పూర్తిగా అండర్ డ్రైనేజీ నిర్మాణం ఏర్పాటు చేయడం జరిగింది. నిర్మించిన డ్రైనేజీలకు రోడ్ల వెంట రాకపోకలకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా మట్టితో రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ పసునూరి యుగంధర్ రెడ్డి, ఉప సర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య.







## యూరియా యాప్ రద్దు చేయాలి

**రైతాంగానికి సరిపడా యూరియా అందుబాటు లో ఉంచాలి**

**దండంపల్లి సత్తయ్య సిపిఎం పట్టణ కార్యదర్శి**

**నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 22 (వార్తా వేదిక సూర్య )** యూరియా కొరత తీవ్రంగా ఉన్నదని, యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, యూరియా యాప్ ను ఎత్తివేసి రైతులకు సరిపడా అందించాలని సీపీఐ(ఎం) నల్లగొండ పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పొలాలు పొట్ట దశలో ఉన్నాయని, ఈ సమయంలో వ్యవసాయానికి యూరియా ఎంతో అవసరం అన్నారు. యూరియా కోసం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, చాలామంది అవగాహన లేని రైతులు యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేయలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. యాప్ ద్వారా యూరియా కోసం సబ్మిట్ టచ్ చేయగానే యూరియా స్టాక్ లేనట్లు వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు యూరియా కొనుగోలు కోసం యాప్ ప్రక్రియను ప్రవేశపెట్టారో వెంటనే ఎత్తివేయాలన్నారు. రైతులకు కావాల్సిన యూరియాను అందుబాటులో ఉంచాలని కోరారు. యాప్ ద్వారా వస్తున్న ఓటీపీ నెంబరు చెప్పడం ద్వారా సైబర్ నేరాలు పెరిగే ప్రమాదం ఉందని అన్నారు ప్రభుత్వం వెంటనే యూరియా యాప్ రద్దుచేసి రైతాంగానికి సరి పడ అన్ని షాపులలో నిల్వ ఉండే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతాంగంతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## చేనేత చీటికి కార్మికుల సెలవుల రద్దును వ్యతిరేకిస్తూ నిరసన తెలిసిన కార్మికులు

**గట్టుప్పల.ఫిబ్రవరి22.వార్త వేదిక సూర్య:** గట్టుప్పల మండలంలోని చేనేత చిటికీల కార్మికులకు సెలవులు రద్దు చేస్తూ చేసిన పని దినాలకే వేతనం కట్టిస్తామని చేనేత పారిశ్రామిక సంఘ యాజమాన్యం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా చేనేత చిటికీలు కట్టే కార్మికులు మండల కేంద్రంలోని స్థానిక చౌరస్తాలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం హేయమైన చర్యని యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలను వెంటనే రద్దుచేసి పాత పద్ధతిలోనే సెలవులు ప్రకటించాలని కార్మికులు ప్రతి ఒక్కరు యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించాలని, కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో ప్రతి కార్మికుడు భాగస్వామి కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో



చెరుపల్లి రాము,పగిళ్ల రమేష్,మందుల శంకర్,పెద్దగోని కుమార్, బీమాగాని యాదయ్య,చేపూరి నరేష్,వేమయ్య,శ్రీను లింగస్వామి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి హత్యకు కారణమైన అగ్రకుల నేరస్థులపై (పీఓఏ) చట్టం కింద కేసులు నమోదు చేయాలి

- వెంటనే అరెస్టు చేయాలి : ఎస్ఎఫ్ఐ డిమాండ్
- ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్



**నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 22 (వార్తా వేదిక సూర్య )** నల్లగొండ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్ ఖమ్మం పాటి శంకర్ విలేకరులతో మాట్లాడుతూ..నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో రజక వర్గానికి చెందిన చిన్నారి ప్రాణాలు కోల్పోవడం బాధాకరం ఈ ఘటన ను భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఇది కేవలం ప్రమాదం కాదని, ఇది అగ్రకుల దౌర్జన్యం, వ్యవస్థాపిత నిర్లక్ష్యం, సామాజిక నేరమని తీవ్రంగా పేర్కొన్నారు. బాధితుడు పేద రజక కుటుంబానికి చెందినవారని తెలిసినా, కనీస భద్రతా చర్యలు తీసుకోకుండా అధికారుల కనుసన్నల్లోనే అగ్రకులానికి చెందిన నేరస్థులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గం అని ఆవేదన వ్యక్తం చేసారు. 1989 ఉల్లంఘనకు స్పష్టమైన ఉదాహరణ. ఈ ఘటన హత్యకు సమానమైన సామాజిక నేరం. పేదల ప్రాణాల పట్ల ఉన్న పాలనా నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతుంది. కులవ్యవస్థ ఇంకా కొనసాగుతుందనే భయంకర వాస్తవానికి ఇది నిదర్శనం ఒక అగ్రకుల నేరస్థుడిని అరెస్టు చేయలేదు. (పి ఓ ఎ) చట్టం కింద కేసు నమోదు చేయలేదు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఇది రాజ్యాంగ ద్రోహం తప్ప మరొకటి కాదు ఈ ఘటనపై (పి ఓ ఎ) యాక్ట్ సంబంధిత సెక్షన్ల కింద తక్షణమే కేసు నమోదు చేయాలి. అగ్రకులానికి చెందిన నేరస్థులందరినీ వెంటనే అరెస్ట్ చేయాలి. బాధిత కుటుంబానికి కనీసం రూ. 25 లక్షల పరిహారం వెంటనే చెల్లించాలి.సంబంధిత పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

ఈ ఘటనపై న్యాయ విచారణ (జ్యుడిషియల్ ఎంక్వైరీ) ప్రకటించాలి. చిన్నారుల ప్రాణాలు చవకగా మారిన ఈ వ్యవస్థపై మౌనంగా ఉండకుండా ప్రజాస్వామిక వాదులు, మేధావులు స్పందించాలని, న్యాయం జరిగే వరకు బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరుతున్నాము. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే, ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో బాధితుల తరపున పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## పచ్చని చెట్లపై గొడ్డలి వేటు!



**ప్రభుత్వ భూమిలో చెట్లు నరికివేత!**

**నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 22 (వార్తా వేదిక సూర్య )** నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం కోమటికుంట తండా గ్రామపంచాయతీ పరిధిలో కేంద్ర ప్రభుత్వ (గ్రామీణ) నవజ్యోతిఎవత్, భూమి లో రోజు రోజుకు అంతరించిపోతున్న సంపదతో లోపిస్తున్న ప్రకృతి సమతుల్యత లను కాపాడేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తుంటే అవి పెరిగి పెద్దయ్యాకా అక్రమార్కులు వాటిని నరికేసి సొమ్ము చేసుకుంటున్నారు. పర్యవేక్షించి చెట్లను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పెద్దవూర మండలం కోమటికుంట తండా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమి ... ఇవి ప్రభుత్వ ఆస్తులకు సంబంధించినవిగా నిబంధన ఉంది చెట్లను నరకాలంటే గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం తో పాటుగా అటవీశాఖ అనుమతులు చట్టానికి విరుద్ధంగా చెట్లను నరికి వేయించడం పై గ్రామస్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

### అమలుకు నోచుకోని వాల్టా చట్టం

ప్రభుత్వం అటవీ సంపదను కాపాడేందుకు తీసుకు వచ్చిన వాల్టా చట్టం అమలుకు నోచుకోవడం లేదు అనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం చెట్లను కాపాడేందుకు తీసుకువచ్చిన చట్టాలు అమలు చేయాల్సిన అధికారుల చేతివాటంతో ప్రత్యేక చట్టాలు సైతం పేపర్లకు మాత్రమే పరిమితం అవుతున్నాయ నేది స్థానికంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. చట్టాల నుండి తప్పించుకుంటున్నారు.




## యువత చేతిలో మద్యం సీసా కాదు, భవిష్యత్తును తీర్చిదిద్దే విద్య ఉండాలి

**సుద్దాల కాంగ్రెస్ పార్టీ**
**యువగలం జంపాల సోమన్న**



గుండాల ఫిబ్రవరి 22 వార్తవేదిక సూర్య :
సుద్దాలలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువగలం నాయకుడు జంపాల సోమన్న యువత భవిష్యత్తుపై ఆవేదన వ్యక్తం చేశారు. యువత చేతిలో మద్యం సీసా కాదు, వారి జీవితాన్ని తీర్చిదిద్దే విద్య ఉండాలి" అని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం గ్రామాలు, పట్టణాల్లో పెరుగుతున్న బెల్ట్ షాపుల ప్రభావంతో యువత మద్యం వైపు ఆకర్షితులవుతున్నారని, ఇది సమాజానికి ప్రమాదకరమని అన్నారు. చిన్న వయసులోనే మద్యం అలవాటు పడితే చదువు, ఉద్యోగం, కుటుంబ జీవితం అన్నీ దెబ్బతింటాయని ఆయన హెచ్చరించారు. యువత శక్తిని సరైన దారిలో మళ్లించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ మద్యం విక్రయాలను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. యువతకు నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు, క్రీడా వసతులు కల్పిస్తేనే వారు చెడు అలవాట్లకు దూరంగా ఉంటారని తెలిపారు. ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై చైతన్యం కల్పించాలని సూచించారు.ప్రభుత్వం, అధికారులు, ప్రజలు కలిసి యువతను కాపాడేందుకు ముందుకు రావాలని, విద్య ద్వారానే వారి భవిష్యత్తు వారి మారుతుందని జంపాల సోమన్న పిలుపునిచ్చారు.



## వివాహా మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జాలే నరసింహారెడ్డి తిలక్ రెడ్డి

దేవరకొండ ఫిబ్రవరి 22 ( వార్తా వేదిక సూర్య ):
ఆదివారం రోజున చందంపేట మండలంలోని చిత్రియాల గ్రామానికి చెందిన కాట్ల అలివేలు చిన మారయ్య గౌడ్ గార్ల కుమార్తె (మహేశ్వరి, కిరణ్ కుమార్ గౌడ్,) ల దేవరకొండ పట్టణంలోని సాయి రమ్య ఫంక్షన్ హాల్లో జరిగిన వివాహా మహోత్సవ కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొని నూతన వధూ వరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు జాలే నరసింహారెడ్డి తిలక్ రెడ్డి ఈ కార్యక్రమంలో వివిధ అనుబంధ సంఘాల ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు యువజన కాంగ్రెస్ నాయకులు మరియు చిత్రియాల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## సేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

**నేనావత్ బాలు నాయక్**

దేవరకొండ ఫిబ్రవరి 22 (వార్త వేదిక సూర్య ):
హైదరాబాద్ లోని గుర్రగూడలో బంజారా నాయకులు నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాల్లో పాల్గొని,సేవాలాల్ మహాబోగ్ (హోమం) పూజలో ప్రజా ప్రతినిధులు, బంజారా నాయకులతో కలిసి నైవేద్యం సమర్పించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ బంజారా సమాజ ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ సమాజ శ్రేయస్సు కోసం చూపించిన మార్గం ఆదర్శనీయమని అన్నారు. శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బంజారా నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.







## కండ్లు రెండు మంచిగయ్యేంతవరకు చూయించుకోండి

- నెలకొకసారి కంటి శిబిరం పెడతాం
- ధైర్యంగా ఆపరేషన్లకు వెళ్లి రండి అంటూ మహిళలకు భరోసా
- 12వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



చౌటుప్పల్ ఫిబ్రవరి 22 వార్తా వేదిక సూర్య
తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యలతో బాధపడే ప్రతి ఒక్కరికి కంటి చూపు మెరుగవ్వాలనే తలంపుతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలకు భారీ స్పందన వస్తోంది.. ఆదివారం మునుగోడు లోని క్యాంపు కార్యాలయం వద్ద చండూరు మున్సిపాలిటీలోని 10 వార్డుల ప్రజలతోపాటు, చండూరు మండలంలోని 19 గ్రామాల ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ భూతరాజు దశరధలతోపాటు చండూరు మున్సిపాలిటీ మండల నాయకులతో కలసి ప్రారంభింపచేశారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పరిశీలించి ఎవరెవరికి ఏ ఏ కంటి సమస్యలు ఉన్నాయని ఆరా తీసి మీకు నేనున్నానని భరోసా ఇచ్చారు... ఈ 12వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 610 మంది కి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో , 250 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారిలో 155 మంది ని వెంటనే ఆపరేషన్ల కొరకు హైదరాబాద్ లోని శంకర కంటి ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని మంగళవారం తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారికి మీకు నేనున్నానని ధైర్యంగా వెళ్లి ఆపరేషన్లు చేయించుకుని రండని భరోసా ఇచ్చారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు. మీ రెండు కళ్ళు మంచిగా అయ్యేంతవరకు చూయించుకోండని మీకోసం ప్రతి నెల ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని మరోసారి స్పష్టం చేశారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలను ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రుల వారి సౌజన్యంతో తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.





## భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులతో దేవరకొండ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా జీవించాలి

- జనహృదిలో అంతులేని ప్రేమను నింపి, ఆప్యాయతతో బంధాన్ని కట్టగలిగితేనే
- ప్రతి గుండె స్పందన అభిమనంగా మారుతుంది..
- ప్రతి చూపు విశ్వాసంగా మారి ఆశీర్వాదమై నిలుస్తుంది..
- అలాంటి మనసుల మధ్యే ఈ అపూర్వమైన ప్రజాభిమానం నిశ్శబ్దంగా పుష్పిస్తుంది





దేవరకొండ ఫిబ్రవరి 22 (వార్త వేదిక సూర్య):
చింతపల్లి మండలంలోని నెల్వలపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి మల్లన్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకొని,స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ఆ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులతో దేవరకొండ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొనీ చిన్నారులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ నాయకులు వడ్త్య రమేష్

దేవరకొండ ఫిబ్రవరి 22 (వార్త వేదిక సూర్య ):
దేవరకొండ పట్టణంలో శివ సాయి ఫంక్షన్ హాల్ నిర్వహించిన బందేల తిరుపతి యాదవ్ - భవానీ గార్ల కుమారులు సహస్ర- ప్రణయ్ యాదవ్ లా నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్.




## చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని మర్యాద పూర్వకంగా కలిసిన మొయినాబాద్ మున్సిపాలిటీ నూతన పాలక వర్గం

మొయినాబాద్ మున్సిపాలిటీ ఫిబ్రవరి 22 (వార్తా వేదిక సూర్య)
చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని మర్యాద పూర్వకంగా కలిసిన మొయినాబాద్ మున్సిపాలిటీ నూతన పాలక వర్గం. ఇటీవల మొయినాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో ఎమ్మెల్యే కాలే యాదయ్య కు నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్.. మొయినాబాద్ మున్సిపాలిటీ చైర్మన్ సోనియా దర్శన్ , వైస్ చైర్మన్ గరుగు రాజు ముదిరాజ్ లను సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్..ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంతో మున్సిపల్ లో కాంగ్రెస్ జెండా ఎగురవేశామని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో అండగా ఉంటూ మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుపోవాలని నూతన పాలక వర్గానికి సూచించిన మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీలత రాంచందర్ ముదిరాజ్, గడ్డం లక్ష్మీ వెంకట్ రెడ్డి, చేకూరి అరుణ రామకృష్ణ గౌడ్, జగపతిబాబు, వివిధ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.









## రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించిన
# త్రినీటి పాఠశాల విద్యార్థులు



**చౌటుప్పల్ ఫిబ్రవరి 22 వార్తా వేదిక సూర్య.**
చౌటుప్పల్ మున్సిపాలిటీలోని ఉన్న ట్రినిటీ హైస్కూల్ విద్యార్థులు శుక్ర శని వారంలో హైదరాబాద్ సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ 2026 సెకండ్ ఎడిషన్ లో జరుగుతున్న మల్కంబు స్టేట్ కాంపిటీషన్లో ట్రినిటీ హై స్కూల్ విద్యార్థులు కత్తి అక్షిత శ్రీ గణేష్ లు రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించి కాంస్య పథకాలు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ ఈ పోటీలలో 16 జిల్లాల నుంచి మల్కంబు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ట్రినిటీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రజల కనబరిచి రాష్ట్రస్థాయిలో కాంస పథకాలు గెలుచుకోవడం సాధించారని తెలిపారు ఈ విద్యార్థులకు ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి జిల్లా యువజన స్పోర్ట్స్ అధికారి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పథకాలను విద్యార్థులకు అందజేశారు ఈ విద్యార్థులను ట్రినిటీ హై స్కూల్ చైర్మన్ కెవిబి కృష్ణారావు మరియు స్కూల్ డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జీని మంజుల అభినందించారు అలాగే విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన పీఈటీ లు కిరణ్ కుమార్ గోపాల్ హారతిలను అభినందించారు.

## నిత్య నూతన గీతం



అక్షయ నవమి శుభ సందర్భంగా
వెలిసిన గీతం వందేమాతరం
దేశభక్తి భావన రగిలించె గీతం
వందేమాతరం
దేశస్వాతంత్ర సాధనకు నడుం కట్టి
గొంతు విప్పిన వారందరికీ స్ఫూర్తినిచ్చిన
గేయం వందేమాతరం.
బంకింమ్ చంద్ర చటర్జీ కలం నుంచి
జాలు వారిన అక్షర జ్ఞానం
వందేమాతర గేయం
భారతీయుడిగా పుట్టిన ప్రతివాడి గుండెల్లో
పలికిన ఫీంకారమే వందేమాతర గేయం
భారతమాత ముద్దుబిడ్డల భక్తిమంత్రం
బ్రిటిష్ వారి గుండెల్లో సింహ స్వప్నమై
నిలిచిన సమర నినాదమంత్రం
మనమంతా ఐక్యమత్యంతో ఉండాలని కోరుకునే అమృత గీతం.
భారతదేశ ఔన్నత్యాన్ని తెలిపే మధుర గీతం.
బ్రిటిష్ పాలనకు చరమగీతం పాడిన
గేయం వందేమాతరం
భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి
స్ఫూర్తినిచ్చిన గేయం వందేమాతరం.

**రచన: మంజుల పత్తిపాటి**
**మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్**
**యాదాద్రి భువనగిరి జిల్లా**
**తెలంగాణ రాష్ట్రం**
**చరవాణి 9347042218.**





## ఒకటవ వార్డు కౌన్సిలర్లు ఘనంగా సన్మానించిన బత్తుల వాణి విప్లవ గౌడ్

**చౌటుప్పల్ ఫిబ్రవరి 22 వార్త వేదిక సూర్య**
చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 1 వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ కోసనం రాకేష్ రెడ్డి, 3వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ గౌడ్ ఆదివారం ఘనంగా శాలువాలతో పూలమాలతో ఘనంగా సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.యన్.రెడ్డి, చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూర్వి నరసింహ గౌడ్, పర్నె శివారెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

## రాములు ఆకాల మృతి పట్ల సంతాపం



**మోత్కూరు, ఫిబ్రవరి 22( వార్తా వేదిక సూర్య )**
మోత్కూరు మున్సిపల్ పరిధిలోని రాజన్న గూడెం గ్రామంలో మాజీ కౌన్సిలర్ వనం స్వామి పితృ వియోగం చిన్న రాములు ఆదివారం ఆకాల మృతి చెందారు. ఆయన ఆకాల మృతి పట్ల రెడ్ క్రాస్ సంస్థ జిల్లా చైర్మెన్ గుర్రం లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ గడ్డం స్వప్న, సోమ నర్సయ్య, సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం రాములు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి, మున్సిపల్ చైర్మెన్ స్వప్న 5000 రూపాయలను స్వామి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ పన్నాల శ్రీవిద్య శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లేపల్లి వెంకటయ్య, బద్దం నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో పెరగనున్న 50 నియోజకవర్గాలు

**తిరుపతి, ఫిబ్రవరి 22 ( వార్త వేదిక సూర్య ):**
కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. నియోజకవర్గాల పునర్విభజనపై సంకేతాలు పంపింది. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పునర్విభజనకు సంబంధించి బిల్లును పార్లమెంటులో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఏపీలో అసెంబ్లీ సీట్లు మరో 50 పెరిగే అవకాశం ఉంది. ఏడు పార్లమెంట్ స్థానాలు సైతం పెరగనున్నట్లు తెలుస్తోంది.. నియోజకవర్గాల పెంపు అనేది రాష్ట్ర విభజన సమయంలోనే ప్రస్తావనకు వచ్చింది. విభజన చట్టంలోనే నియోజకవర్గాల పునర్విభజన ద్వారా రాజకీయ అవకాశాలు పెంచుతామని స్పష్టంగా చెప్పారు. పాలనా వికేంద్రీకరణకు నియోజకవర్గాల పెంపు చేపడతామని చెప్పుకొచ్చారు. కానీ ఇంతవరకు నియోజకవర్గాల పునర్విభజన జరగలేదు.ప్రస్తుతం రాష్ట్రంలో 175 అసెంబ్లీ... 25 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు.. 117 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అయితే పునర్విభజనతో అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ సీట్లు పెరిగే అవకాశం ఉంది. చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పట్లో అధికార పార్టీకి అనుకూలంగా ఈ ప్రక్రియ జరిగింది అనేది ఒక విశ్లేషణ. 2004లో రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే అప్పట్లో తెలుగుదేశం పార్టీ కూడా బలంగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపికి బలమైన స్థానాలను... విభజించి బలహీనపరిచారు అన్నది ఒక ఆరోపణ. ఇప్పుడు గాని నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు తారుమారు అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది.మొన్నటి ఎన్నికల్లో జనసేన 21, బిజెపి 10, మిగిలిన స్థానాల్లో టిడిపి పోటీ చేసింది. అయితే 164 సీట్లలో కూటమి గెలిచింది. అయితే పొత్తులో భాగంగా ఓ 50 మంది నేతలు తమ సీట్లను త్యాగం చేశారు. టిడిపిలో ఇటువంటి వారి సంఖ్య అధికంగా ఉంది. మరోవైపు జనసేనతో పాటు బిజెపిలో సైతం చాలామంది ఎమ్మెల్యే సీట్ల ఆశావాహులు ఉన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గా



**ప్రతీక సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన మాజీ మంత్రి,సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్**



**దేవరకొండ ఫిబ్రవరి 22 (వార్త వేదిక సూర్య ):**
మత సామరస్యానికి ప్రతీక సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గా అని మాజీ మంత్రి,సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆదివారం చింతపల్లి మండలం పీకే మల్లెపల్లిలోని సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గాలో వారు ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని సన్మానించారు ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ రాము దాదా స్వామిని దర్శించిన గిరిజన సంక్షేమ సంఘం
# నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ పవర్

**దేవరకొండ ఫిబ్రవరి 22 ( వార్త వేదిక సూర్య ):**
హోలీ పండుగకు పది రోజుల ముందు ప్రారంభమయ్యే మూడు రోజుల మహా జాతర సందర్భంగా శేరిపల్లి గ్రామ దేవుడైన శ్రీ శ్రీ శ్రీ రాము దాదా స్వామిని గిరిజన సంక్షేమ సంఘం నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ పవర్ భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుండి, ఇతర రాష్ట్రాలు మరియు విదేశాల నుండి సైతం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి ఆశీర్వాదాలు పొందుతున్నారు. పాడి పంటలు పుష్కలంగా కలగాలని, సంతానం లేని దంపతులకు సంతానం కలగాలని, కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వం నెలకొనాలని ఆకాంక్షిస్తూ భక్తులు దీపాదూప నైవేద్యాలతో ఆకాండ జ్యోతిని స్మరించుకుంటున్నారు. ఈ సందర్భంగా మోహన్ పవర్ మాట్లాడుతూ, బంజారా సమాజ ఆరాధ్య దైవమైన శ్రీ రాము దాదా స్వామి మహిమ రోజు రోజుకూ విస్తరిస్తోందని, కొండమల్లేపల్లి నుండి 7 కిలోమీటర్ల దూరంలో కల్వపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఈ దేవాలయం తెలంగాణ వ్యాప్తంగా ప్రసిద్ధి పొందడం గర్వకారణమని తెలిపారు. దేవాలయ పూజారి శ్రీ శ్రీ శ్రీ రామావత్ హరి నాయక్ గారు దేవాలయ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ భక్తులకు సదుపాయాలు కల్పిస్తున్నారని కొనియాడారు.



మూడు రోజుల పాటు కొనసాగే ఈ మహా జాతర విజయవంతం కావాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు నిండాలని గిరిజన సంక్షేమ సంఘం తరపున మోహన్ పవర్ ఆకాంక్షించారు.

## శివరాత్రికి శివ భక్తులకి లాఠీ దెబ్బలు..రంజాన్ మాసంలో ముస్లిమ్ ఉద్యోగుల పనివేళల్లో
# మినహాయింపు నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం : శివసేన

**చౌటుప్పల్ ఫిబ్రవరి 22 వార్తా వేదిక సూర్య**
ఉద్ధవ్ బాల సాహెబ్ థాక్రే పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బాతరాజు వెంకటేష్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికార పక్షములో ఉన్న ప్రభుత్వాలు హిందువులకి పవిత్రమైన దసరా మరియు శివరాత్రికి లో శివ భక్తులపై లాఠీ ప్రయోగించి పోలీస్ బలాన్ని ఉపయోగించిన ఆంధ్ర ప్రభుత్వం రంజాన్ మాసంలో ముస్లిమ్ ఉద్యోగులకు 3 గంటలు పనివేళలు మినహాయింపు అదేవిధముగా తెలంగాణ రాష్ట్రంలో అయ్యప్ప మాల ధరించి విధులకు హాజరైన పోలీస్ కి మెమో ఇచ్చి ఇవ్వడంపై శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బాతరాజు వెంకటేష్ తీవ్రంగా మండిపడ్డారు.హిందూ పండగ వేళల్లో రద్దీ పేరుతో బస్సు ప్రయాణ ధరలు పెంచి ముస్లిమ్ మరియు క్రిస్టియన్స్ కి ప్రత్యేక రాయితీలు ప్రకటిస్తున్న తెలుగు రాష్ట్రాల అధికారక పార్టీల వైఖరిని శివసేన పార్టీ ఖండిస్తుందని తెలియజేసారు. హిందువులను ఓటు బ్యాంకుగా చూస్తూన్న పాలకులకి రాబోవు రోజుల్లో ఓటమి తప్పదని శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుబాతరాజు వెంకటేష్ తీవ్రంగా హెచ్చరించారు .ఇకనైనా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ద్వంధ వైఖరి విడనాడాలని సూచించారు . సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూస శ్రీనివాస్ గారు రాష్ట్ర కార్యదర్శి మహేష్ రాంపాక కార్యాలయ ప్రాముఖ్ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం కమిటీఎన్నిక



**మోత్కూరు, ఫిబ్రవరి 22( వార్త వేదిక సూర్య)**
మండలంలోని పాలడుగు గ్రామంలో గ్రామ యాదవ సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జక్కుల అంజయ్య, ఉపాధ్యక్షులుగా గొర్ల నరేందర్, కోసన మత్స్యగిరి, కోశాధికారిగా జక్కుల శ్రీశైలం, సహాయ కార్యదర్శులుగా ముక్కాముల నర్సింహ్మా గుదే మధుసూదన్, సలహాదారులు ముక్కాముల మత్స్యగిరి, ముప్పిడి మల్లేశం, ముక్కాముల గంగమల్లు తో పాటు మరి 10 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు అధ్యక్షులు అంజయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



**పీకే మల్లెపల్లి సయ్యద్ హజ్రత్ అబ్బాస్ దర్గా ఉత్సావానికి విచ్చేయుచున్న మాజీ మంత్రివర్యులు సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి గారికి ఓ ఆర్ ఆర్ సమీపంలో ఘన స్వాగతం పలికిన బిఆర్ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీందర్ కుమార్ నాయక్, కేతావత్ బిల్యా నాయక్.**

-దేవరకొండ ఫిబ్రవరి 22 ( వార్త వేదిక సూర్య)

యాదాద్రి భువనగిరి వార్త వేదిక సూర్య || హైదరాబాద్ సోమవారం, ఫిబ్రవరి 23, 2026 ||
సంపుటి : 1 సంచిక : 268

# మా ఇంటి బంగారం విడుదల అప్పుడే



ఖుషి తర్వాత కథానాయికగా తెలుగు తెరపై కనిపించలేదు సమంత. ఆ మధ్య 'శుభం' సినిమాలో మాత్రం అతిధి పాత్రలో మెరిశారు. కథానాయికగా సామ్ ఇంత గ్యాప్ తీసుకోవడం ఆమె అభిమానులకు మింగుడు పడటం లేదు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా తానే స్వయంగా నిర్మిస్తూ, నటిస్తున్న 'మా ఇంటి బంగారం' సినిమా విడుదల తేదీని సమంత ప్రకటించారు. మే 15న ఈ సినిమా విడుదల కానుంది. నందినిరెడ్డి దర్శకత్వంలో ట్రలాలా మూవీంగ్ పిక్చర్స్ పతాకంపై సమంత నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొని ఉంది. దానికి ఇటీవల విడుదలైన టీజర్ కూడా ఓ కారణం. కుటుంబ సాంప్రదాయాలకు విలువనిచ్చే కోడలిగా ఓ వైపు అమాయకంగా కనిపిస్తూనే, మరోవైపు యాక్షన్ మోడ్‌లో అదరగొట్టారు సమంత. ఈ టీజర్ చూసిన వారంతా సినిమా ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా అని ఆతృతగా ఉన్నారు. బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే.

## సినీ వార్తలు




## మెడ ముట్టుకుంటే.. తొడగొట్టినట్టే..

'పవర్‌స్టార్ ఇమేజ్‌కి తగ్గట్టుగా పాట ఉండాలని.. దానికి ఆస్కార్ పెన్నే కరెక్ట్ అని చంద్రబోస్‌ని కలిశాను. పవన్‌కల్యాణ్‌పై అభిమానంతో.. ఆయన జీవన శైలిపై అవగాహనతో.. పవన్‌కల్యాణ్‌కి మాత్రమే సెట్ అయ్యేలా చంద్రబోస్ ఈ పాట రాశారు. 'మెత్తని మట్టిలో మొలిసిన మొలకవు కాదోయ్ నువ్వు.. బండరాళ్లను బద్దలు కొట్టిన మొండి మొక్కవు నువ్వు..' అనేది ఈ పాటలో నాకిష్టమైన లైన్. యేటికి ఎదురీదడం అంటే ఎప్పుడూ పవన్‌కల్యాణ్ ముందుంటారు. ఆయన ప్రయాణమంతా ఈ పాటలో ఉండేలా ప్రయత్నించాం. ఈ పాటకోసం దేవిశ్రీ, చంద్రబోస్ ప్రాణం పెట్టారు. పవన్ స్వాగ్, పవన్ పవర్ ఈ సినిమాలో చూస్తారు' అని హరీశ్‌శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్‌సింగ్'. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠంలో 'ఆరా ఆఫ్ ఉస్తాద్' సాంగ్ గ్రాండ్ లాంచ్ ఈవెంట్‌ని విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో దర్శకుడు హరీశ్‌శంకర్ పై విధంగా స్పందించారు. పవన్‌కల్యాణ్ కెరీర్లో నిలిచిపోయేలా ఈ పాట ఉంటుందని, పవర్‌స్టార్ సినిమాకు సంగీతం అందించడంలో ఓ కిక్ ఉంటుందని సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ అన్నారు. 'మెడ ముట్టుకుంటే.. తొడగొట్టినట్టే.. జుట్టెగురుతుంటే.. ఇక దడదడ పిడుగులు పడినట్టే.. ' అంటూ సాగే ఈ పాట పవన్‌కల్యాణ్ వ్యక్తిత్వాన్ని ఎలివేట్ చేసేలా సాగింది. ఇంకా ఈ కార్యక్రమంలో గీత రచయిత చంద్రబోస్, దర్శకుడు దశరథ్ కూడా పాల్గొన్నారు.

## నేను చీప్ కాఫీ అయితే.. కంగనా?: తాప్సీ

సినీ పరిశ్రమ వంటి కాంపిటేటివ్ ఫీల్డ్‌లో కథానాయికలు కలిసి స్నేహంగా మసలడం అరుదైన విషయమే. పైకి అంతా నవ్వుతూ కనిపించినా నివురుగప్పిన నిప్పులా అంతర్గత విభేదాలు ఉంటూనే ఉంటాయి. కంగనా రనౌత్, తాప్సీ మధ్య విభేదాలు తలెత్తాయంటూ గతంలో వార్తలొచ్చాయి. తాజాగా ఈ వ్యవహారంపైనే తాప్సీ స్పందించింది. నా వరకూ నేను ఎప్పుడూ ఎవరితో గొడవ పడలేదు. ముఖ్యంగా కంగనాపై వ్యతిరేకంగా ఒక్కమాట కూడా మాట్లాడలేదు. కానీ ఆమె సోదరి నాపై అనుచిత వ్యాఖ్యలు చేసింది. నన్ను 'చీప్ కాపీ' అంటూ సంభోదించింది. నేను ప్రేరణగా తీసుకునే నటీమణుల్లో కంగనారనౌత్ ఒకరు. నేనింకా కంగనా గొప్ప నటి అనుకుంటున్నా. నేను చీప్ కాపీ అయితే.. కంగనా ఏమవుతారు? అంటూ తెలివిగా కౌంటరిచ్చింది తాప్సీ.







## ఉమెన్ సైంటిఫిక్ థ్రిల్లర్

స్వీయ దర్శకత్వంలో పద్మనాభరెడ్డితో కలిసి పూర్వాజ్ నిర్మించిన ఉమెన్ సెంట్రిక్ సైకో థ్రిల్లర్ 'కిల్లర్'. జ్యోతి పూర్వాజ్ కథానాయిక. త్వరలో సినిమా విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం టీజర్ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. కథానాయిక జ్యోతి పూర్వాజ్ మాట్లాడుతూ 'ఇందులోని నా పాత్రలో ఆరేడు షేడ్స్ ఉంటాయి. విజయశాంతిలా యాక్షన్ సినిమాలు చేయాలనేది నా డ్రీమ్. ఈ సినిమాతో ఆ కల నెరవేరింది. ఈ సినిమాకోసం డైరెక్టర్ పూర్వాజ్ చాలా కష్టపడ్డారు. నటిగా నాకు, దర్శకుడిగా పూర్వాజ్‌కే మంచి పేరు తెచ్చే చిత్రమిది.' అని నమ్మకంగా చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎమోషనల్ డ్రామా, బ్రదర్-సిస్టర్ బాండింగ్, రివేంజ్, సబ్ కాన్షియస్ ఐడెంటిటీ.. అంశాల మేళవింపుగా రూపొందిన సైకో థ్రిల్లర్ ఇదని, స్క్రీన్‌ప్లేలో మల్టీ లేయర్లున్నా, అందరికీ సినిమా అర్థమవుతుందని, త్వరలోనే సినిమాను రిలీజ్ చేస్తామని దర్శకుడు పూర్వాజ్ తెలిపారు. ఇంకా లైన్ ప్రొడ్యూసర్స్ సీతారామారావు, దశరథ మాధవ్, మనీష గిలాడ, గౌతమ్ చక్రధర్, విశాల్‌రాజ్, శ్రీనివాస్, చందు, కాళీచరణ్ కూడా మాట్లాడారు.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**